పెండింగ్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు

- కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు వారమైనా జారీ కాని డిజిటల్ సంతకం
- బల్దియా చుట్టూ పక్షం రోజులుగా దరఖాస్తుదారుల చక్కర్లు



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ కార్యాలయంలో అధికారులు లేరని ధ్రువపత్రాలపై సంతకాల పెండింగ్ ఉండటం చూశాం. కానీ కామారెడ్డి మున్సిపల్‌లో కమిషనర్ ఉన్నా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యమవుతున్నాయి. టేక్రియాల్‌కు చెందిన ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకున్న మరణ ధ్రువీకరణపత్రం కోసం రెండు వారాలుగా కమిషనర్ డిజిటల్ కీ లేదని సంతకం కాలేదని కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. ఇలా చాలా మంది దరఖాస్తుదారులు బల్దియా కార్యాలయం చుట్టూ నిత్యం చక్కర్లు కొడుతున్నారు. కామారెడ్డి మున్సిపాలిటీలో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. వరంగల్ కార్పొరేషన్ నుంచి పదోన్నతిపై ఈ నెల 3న నూతన కమిషనర్ రాజేందర్‌రెడ్డి వచ్చి విధుల్లో చేరారు. విధుల్లో చేరిన రెండు రోజుల్లోనే ఆయనకు డిజిటల్ కీ జారీ కావాల్సి ఉంది. వారం రోజులు దాటినా ఇప్పటికీ డిజిటల్ కీ జారీ కాలేదు. ఆయన పేరిట డిజిటల్ కీ కోసం సీడీఎంఏకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆయన ఇక్కడికి కమిషనర్‌గా వచ్చినట్లు ఇంకా ప్రభుత్వం నుంచి ఆర్డర్ కాపీ బల్దియాకు చేరలేదు. వారం రోజులుగా పెండింగ్‌లోనే ఉంది. ఈ నేపథ్యంలో ఆర్డర్ కాపీ లేక డిజిటల్ కీ కోసం దరఖాస్తు చేసుకోవడం సాధ్యం కావడం లేదు. అంతకు ముందటి కమిషనర్ స్పందన రిలీవ్ అయ్యే ముందు వారం రోజుల పాటు సెలవుల్లో ఉండటంతో ఆన్‌లైన్‌లో జనన, మరణ, ఓనర్‌షిప్ తదితరాలకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పటి వరకు పక్షం రోజులైనా వాటిపై సంతకాలు కావడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సోమవారం ఆర్డర్ కాపీ బల్దియాకు అందితేనే ఈనెల 14లోపు డిజిటల్ కీ రావచ్చు. లేకుంటే ఇంకా ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విషయమై కమిషనర్ రాజేందర్‌రెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా.. ఇంకా తనకు డిజిటల్ కీ జారీ కాలేదని, రాగానే ఆన్‌లైన్‌లో పెండింగ్ దరఖాస్తులన్నీ జారీ చేస్తానని చెప్పారు.

యువత క్రీడల్లో రాణించాలి

బాన్సువాడ రూరల్: యువత క్రీడల్లో రాణించాలని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల స్వామి అన్నారు. శనివారం కళాశాల మైదానంలో 3 రోజులుగా నిర్వహిస్తున్న మేరా యువ భారత్ క్లస్టర్ ఆఫ్ బ్లాక్ స్పోర్ట్స్ మీట్-2025 విజేతలకు బహుమతులు అందించి మాట్లాడారు. క్రీడాపోటీల్లో పాల్గొనడం వల్ల స్నేహ భావం, ఐకమత్యం, శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. వాలీబాల్, బ్యాడ్మింటన్‌లో ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు విజయం సాధించగా కబడ్డీలో ఎస్ఎస్ఎల్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమోంటోలు అందజేశారు. త్వరలోనే జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామని ఎన్‌వైకే వలంటీర్ సునీల్ రాథోడ్ తెలిపారు. కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి చిరంజీవి, ఎన్‌సీసీ ఇన్‌చార్జి కృష్ణ రాథోడ్, అధ్యాపకులు వినయ్, భగవాన్, సుధాకర్‌రెడ్డి, అలీ తదితరులున్నారు.



శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బహుమతులు అందుకుంటున్న విజేతలు

తల్లిదండ్రులే మన హీరోలు



మాట్లాడుతున్న ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ రమేశ్

దోమకొండ : ప్రస్తుతం కొంతమంది యువకులు, సినిమా హీరోల పట్ల వెర్రి అభిమానం చూపించి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని, అభిమానం, ప్రేమ చూపించాల్సింది తల్లిదండ్రులపైనే కానీ సినిమా హీరోలపై కాదని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ రమేశ్ చైతన్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మండలానికి చెందిన అన్ని ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు 'జీవితంలో లక్ష్యాలు, సవాళ్లు' అనే అంశంపై ఆయన అవగాహన కల్పించారు. పరీక్షల్లో అనుసరించవలసినటువంటి వ్యూహాలు, జ్ఞాపకశక్తిని పెంపొందించుకునే చిట్కాలు, ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు వివరించారు. పిరికితనం వదిలేసి జీవితంలో ఏదో సాధించాలి గాని ఆత్మహత్యలు, డ్రగ్స్ ఆలోచనలు చేస్తే అవి వారితో పాటు కుటుంబానికి, సమాజానికి ప్రతికూలంగా మారి భవిష్యత్తులో ఇబ్బందులకు గురవుతారని హెచ్చరించారు. చెడు వ్యసనాలకు బానిసైతే కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. విద్యార్థులు నైతిక విలువలు, జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంఈవో విజయ్ కుమార్ సూచించారు. ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్, రాధాలక్ష్మి, ఉపాధ్యాయులు బాలకిషన్, హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవోఎస్ మిషన్ల ద్వారా చెల్లింపులు చేయాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిరూరల్: స్త్రీనిధి రుణాలు పొందిన సభ్యులు పీవోఎస్(పాయింట్ ఆఫ్ సేల్) మిషన్ల ద్వారా చెల్లింపులు చేయాలని సెర్ప్ ఏపీడీ మురళీకృష్ణ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘం సభ్యులకు పీవోఎస్ మిషన్ల వాడకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రుణాలు పొందిన సభ్యులు ఆన్‌లైన్ ద్వారా పీవోఎస్ మిషన్ల ద్వారా స్వైపింగ్ చేసి పేమెంట్ చేయాలని అన్నారు. దీని ద్వారా రుణాలకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా ఉంటుందన్నారు. ఏపీఎం ప్రసన్నరాణి, తదితరులున్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్దాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు
- ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యకర్తలతో సమావేశం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు

బిచ్కుంద(జుక్కల్) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, రాష్ట్ర నాయకులు పల్లె గంగారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం బిచ్కుందలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మీ ప్రాంత పట్టభద్రులను చైతన్యపరిచి బీజేపీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసేలా ప్రచారం చేయాలని కోరారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని.. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంతో బిచ్కుంద గాంధీచౌక్‌లో టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే అరుణతార, మండల అధ్యక్షుడు విఠ్ఠు, శివాజీ పటేల్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న గంగారెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బీజేపీ బలపరిచిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కామారెడ్డి ఇన్‌చార్జి గంగారెడ్డి కోరారు. ఎర్రాపహాడ్‌లో గల రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం పట్టభద్రులు, ఉపాధ్యాయుల సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ పట్టభద్రుల బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అంజిరెడ్డి నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇప్పటికే వ్యతిరేకత ఏర్పడి ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూ పుతున్నారని, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నీలంరాజులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి ఇన్‌చార్జి హైమారెడ్డి, మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు లింగారావు, రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవ సంబురాలు



బాన్సువాడలో ..



జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం ముందు సంబురాలు చేసుకుంటున్న శ్రేణులు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించడంతో శనివారం జిల్లా వ్యాప్తంగా బీ జేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. లిక్కర్ కేసులో కూరుకుపోయిన 'ఆప్' ను ఢిల్లీ ప్రజలు ఊడ్చేశారని అన్నారు. బీజేపీ విజయం సాధించడానికి మోదీ ప్రభుత్వం చే సిన అభివృద్ధే కారణమన్నారు. 2029లో తెలంగాణాలో కూడా బీజేపీ అధికారం చేపడుతుందని జోస్యం చెప్పారు. – సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డిలో..



నస్రుల్లాబాద్‌లో..



రామారెడ్డిలో..



తిప్పాపూర్‌లో..



మాచారెడ్డిలో..



నాగిరెడ్డిపేటలో మిఠాయిలు తినిపిస్తూ..

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



భిక్కనూరు: స్థానిక ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా 46 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రకటించినందున తిప్పాపూర్ గ్రామంలో బీసీ సంఘాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులతో పాటు ముదిరాజు, యాదవ, మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

మండల మున్నూరుకాపు..



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల మున్నూరు కాపు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్లూరి పండరి, గౌరవ అధ్యక్షుడిగా సాతెల్లి పండరి, ఉపాధ్యక్షులుగా గిరి అర్వింద్, పేరడి గంగారాం, ప్రధాన కార్యదర్శిగా గిరి మహేందర్‌ను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు పండరి మాట్లాడుతూ.. మున్నూరు కాపులకు రావాల్సిన అన్ని పథకాలు అందరికి అందేలా చూస్తానని పేర్కొన్నారు. సంఘం సభ్యులు కల్లూరి నరహరి, బల్‌రాజు, రవి, మొగులయ్య, అశోక్ తదితరులున్నారు.

మున్నూరుకాపు పట్టణ అధ్యక్షుడిగా క్రాంతి

కామారెడ్డి టౌన్: మున్నూరుకాపు సంఘం పట్టణ అధ్యక్షుడిగా తోట క్రాంతిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేశారు. ప్రతినిధులు గౌతమ్, పెద్దనారాయణ, నర్సింలు తదితరులున్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం..

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల



పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాస్టర్ డి.మోషే(ఎక్కపల్లి), జనరల్ సెక్రటరీగా పాస్టర్ మహేష్(భవానిపేట), ట్రెజరర్ జాన్ మార్క్(నల్లమడుగు), వీరితో పాటు సలహాదారులు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. వీరు రెండు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారు.

ప్రారంభమైన ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



కామారెడ్డి అర్బన్/కామారెడ్డిరూరల్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి మహాశివలింగేశ్వర ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమాచారం..

శ్రీరామ జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి భగవద్గీత ప్రవచనాలు చేశారు. ఆదివారం ఉదయం సామూహిక యజ్ఞం నిర్వహించనున్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి

రామారెడ్డి: మండల వ్యాప్తంగా గంగపుత్ర సంఘాల ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘ భవనంలో సంఘ సభ్యులు మూల పురుషుడైన భీష్ముడి, భీష్మఏకాదశిని జెండా ఆవిష్కరణ చేశారు. భీష్మ ఏకాదశి ప్రాముఖ్యత గురించి తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు నామాల లింబాద్రి, డైరెక్టర్ పిప్పరి గణేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిప్పరి లింబాద్రి, మాజీ అధ్యక్షులు నామాల నారాయణ, పిట్టల గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఎన్‌డీడీ కార్యక్రమం వాయిదా

రాజంపేట: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం(ఎన్‌డీడీ) కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు రాజంపేట పీహెచ్‌సీ డాక్టర్ విజయ మహాలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, 19 సంవత్సరాల బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రలు వేయడం నిలిపివేశారు.

దుకాణాల తనిఖీ

బిచ్కుంద(జుక్కల్): నిషేధిత గుట్కాలు అమ్ముతున్నారని సమాచారం మేరకు మండల కేంద్రంలో శనివారం ఓ కిరాణ వ్యాపారి గోదాం, దుకాణంలో పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై శంకర్ మాట్లాడుతూ.. గుట్కాలు విక్రయిస్తున్నారని సమాచారంతో తనిఖీలు చేపట్టామన్నారు. పాన్ మసాలా ప్యాకెట్లు ఉన్నాయి.. గుట్కాలు లభించలేదని తెలిపారు. పోలీసులు వస్తున్నారని సమాచారం దుకాణదారులకు తెలియడంతో గుట్కాలు దొరక్కుండా అందరూ జాగ్రత్తపడ్డారని, నిషేధిత గుట్కాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తాడ్వాయిలో వాహనాలు..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో శనివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలతో పాటు సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానాలు విధించారు. పెండింగ్ చలానాలున్న వాహనాలకు ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టేలా చర్యలు తీసుకున్నారు.

మొగి పురుగుతో రైతులు జాగ్రత్తగా ఉండాలి



బీబీపేట: వరికి ప్రస్తుతం సోకుతున్న మొగి పురుగు పట్ల రైతులందరూ జాగ్రత్తగా ఉండాలని ఏఈవో రాజేశ్ అన్నారు. శనివారం జనగామలో వరి పంటలను పరిశీలించిన ఆయన రైతులకు పలు సూచనలు ఇచ్చారు. రైతులు వరి పంటను ఆరబెడుతూ నీళ్ల పెట్టాలని, వాతావరణంలోని మార్పుల వల్ల కూడా వరి పంట ఎర్రబారుతుందని అన్నారు.

తాగునీరు క్లోరినేషన్ చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కార్యదర్శులకు ఎంపీడీవో నరేష్ సూచించారు. శనివారం మోతె, నల్లమడుగు, నల్లమడుగు పెద్దతండా తదితర గ్రామాల్లో వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ట్యాంకుల పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.ఎంపీవో మలహరి ఉన్నారు.

భజన వాయిద్యాల బహూకరణ



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లి హన్మాన్ దేవాలయంలోని భజన మండలికి భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన పురం రాజమౌళి భజన వాయిద్యాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు దాత పురం రాజమౌళిని శాలువాతో సత్కరించారు. వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యం, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి వెండి కిరీటాలు..



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బాధ్యులకు అదే గ్రామానికి చెందిన పాత కిష్టయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు పాత లక్ష్మీరాజం, పండరి, రమేష్, అశోక్ శనివారం కిలో బరువున్న వెండి కిరీటాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్ రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

చుక్కాపూర్‌ను సందర్శించిన అటవీ శాఖాధికారులు



మాచారెడ్డి: చుక్కాపూర్ గ్రామాన్ని శనివారం అటవీశాఖ ట్రైనీ సెక్షన్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో నాటిన మొక్కలను పరిశీలించారు. నాటిన మొక్కలను ఎలా సంరక్షించాలి..ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలను ఎఫ్‌డీవో పీవీ రామకృష్ణ వివరించారు. అలాగే అటవీ సంపదను ప్రతి ఒక్కరు కాపాడాలని, సంరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. ఎఫ్ఆర్వోలు రమేశ్, దివ్య, 40 మంది ట్రైనీ అధికారులు ఉన్నారు.

సంక్షిప్తం

వాటర్ ప్లాంట్ ప్రారంభం



లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేటలో శుక్రవారం రాత్రి పైడి ఎల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ట్రస్టు ద్వారా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయో రోజుల్లో గ్రామీణ ప్రాంత ప్రజలకు మరిన్ని సేవలు ట్రస్టు ద్వారా అందిస్తామన్నారు. అనంతరం గ్రామస్తులు ఆయనను గజమాలతో సత్కరించారు. గ్రామ పెద్దలు నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు..

ఎల్లారెడ్డిరూరల్: రుద్రారంలో శనివారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. గ్రామంలో ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. రోడ్డు పనులు నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాయకులు రుక్మారెడ్డి, సత్యం తదితరులున్నారు.

ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అంజని గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మణికుమార్ మాట్లాడుతూ.. 36 పశువులకు గర్భకోశ చికిత్సలు, రెండు పశువులకు కృత్రిమ గర్భధారణ, 16 పశువులకు సాధారణ చికిత్సలు, 17 దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ బస్వరాజు, రవీందర్, రాజిరెడ్డి, పశువుల పెంపకందారులు పాల్గొన్నారు.

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తపాలాశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రతి పథకాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని నాగిరెడ్డిపేట సబ్‌పోస్ట్ మాస్టర్ ఆసిఫ్ అలీ సూచించారు. తాండూర్‌లో శనివారం వివిధ గ్రామాలకు చెందిన బీపీఎంలతో కలిసి ఇంటింటికి తిరిగి తపాలాశాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎస్‌బీఎంతోపాటు బీపీఎంలు గోపాల్, రాజేందర్, నాగరాజు, జాఫర్, నరేందర్, నందన, పూజిత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల స్పెషల్ డ్రైవ్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలో మున్సిపల్ సిబ్బంది శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఇంటి పన్నులను వసూలు చేశారు. పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి పన్నులను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్ కుమార్ కోరారు.